సాక్షి
కర్నూలు
బుధవారం । 9 । జూలై । 2025



ఈరన్న ఉత్సవాలకు ఏర్పాట్లు

ఈరన్న స్వామి శ్రావణ మాసోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. ఉత్సవ ఏర్పాట్లపై మంగళ వారం క్షేత్రంలో సమీక్ష నిర్వహించారు. 8లో▸



ఆపరేషన్ 'క్యాంపస్ సేఫ్ జోన్'

విద్యాసంస్థల సమీపంలో పొగా కు ఉత్పత్తుల అమ్మకంపై నిషేధం విధిస్తూ సురక్షితమైన వాతావరణాన్ని కల్పించేలా జిల్లా పోలీసు శాఖ ఆపరేషన్ 'క్యాంపస్ సేఫ్ జోన్' కార్యక్రమాన్ని చేపట్టింది. 8లో▸



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలోని స్వామి అమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి అర్చకులు మంగళవారం పరోక్షసేవ నిర్వహించారు.

న్యూస్‌రీల్

పోస్టల్ ఖాతాకు ఎన్‌పీసీఐ లింకు చేయించండి

కర్నూలు(అర్బన్): జిల్లాలో అర్హత కలిగిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎస్సీ విద్యార్థులు తల్లికి వందనం కోసం ఓపెన్ చేసిన పోస్టల్ ఖాతాకు ఎన్‌పీసీఐ లింకు చేయించాలని సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిణి బి.రాధిక మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ నెల 10న రెండవ విడత తల్లికి వందనం పథకం కింద ప్రభుత్వం నిధులను విడుదల చేయనుందన్నారు. ఈ నేపథ్యంలోనే జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, రెసిడెన్షియల్, ఎయిడెడ్, కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూల్స్ ప్రిన్సిపాల్స్ తమ కళాశాలల్లో చదువుతున్న ఎస్సీ విద్యార్థులకు పోస్టల్ ఖాతా, ఎన్‌పీసీఐపై మార్గనిర్దేశం చేయాలన్నారు. అలాగే తమకు సమీపంలోని పోస్టాఫీసు సిబ్బందిని సంప్రదించి కళాశాలల్లోనే ప్రత్యేక శిబిరాలు నిర్వహించి పోస్టల్ ఖాతాలను ఓపెన్ చేయించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

నేడు కార్మిక సంఘాల సార్వత్రిక సమ్మె



సమ్మె విజయవంతానికి ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

కర్నూలు(సెంట్రల్): కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు బుధవారం జిల్లా వ్యాప్తంగా సార్వత్రిక సమ్మె నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంతోపాటు మండల, డివిజన్ కేంద్రాల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు ఏఐటీయూసీ, సీఐటీయూ ప్రణాళికలు రూపొందించాయి. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో నిర్వహించే ఆందోళనల్లో కార్మిక, కర్షక, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలపై పోరుబాట సాగించనున్నారు. ఇప్పటికే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. కర్నూలులో అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జెడ్పీ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నారు.

బ్యాంకుల మద్దతు

కర్నూలు(అగ్రికల్చర్): ఈ నెల 9న జరిగే సార్వత్రిక సమ్మెలో బ్యాంకులు కూడా పాల్గొననున్నాయి. ఏఐబీఈఏ, ఏఐబీవోఏ, బీఈఎఫ్ఐ, ఎల్ఐసీ,జీఐసీ ట్రేడ్‌యూనియన్‌లు బ్యాంకులు, బీమా కంపెనీల సమ్మెకు పిలుపు నిచ్చాయి. అయితే స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, కో–ఆపరేటివ్ బ్యాంకులు యథావిధిగా పనిచేయనున్నాయి.కొన్ని కార్పొరేట్ బ్యాంకులు, ప్రయివేటు బ్యాంకులు కూడా సేవలు అందించనున్నాయి. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు సహా మిగిలిన బ్యాంకులు, ఎల్ఐసీ, ఇతర బీమా కంపెనీలు సార్వత్రిక సమ్మెలో పాల్గొంటాయని యుఫ్‌బీయు జిల్లా కన్వీనర్ ఇ.నాగరాజు తెలిపారు.

నేడు పీఏసీఎస్‌ల సీఈఓలకు అవగాహన సదస్సు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల సీఈఓలు, సిబ్బందికి ఈ నెల 9న బనవాసిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో వివిధ అంశాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో పీఏసీఎస్‌ల భాగస్వామ్యం పెంచాలనే లక్ష్యంతో ఉన్నామని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదే విధంగా సహకార సంఘాల బలోపేతంపై కూడా అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు. నాబార్డు ఆధ్వర్యంలో జరిగే అవగాహన సదస్సుల్లో బనవాసి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త రాఘవేంద్ర కూడా పాల్గొంటారన్నారు.

ప్రతిష్టాత్మకంగా మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్

కర్నూలు(సెంట్రల్): జిల్లా వ్యాప్తంగా ఈనెల 10న పేరెంట్స్ టీచర్ మీట్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన టెలీ కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలపై ఆర్డీఓలు, నియోజకవర్గ ప్రత్యేకాధికారులు, మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లు, ఈఓఆర్డీలతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీటీఎంలో మధ్యాహ్న భోజనం, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, సుందరీకరణ, షామియానాలు ఏర్పాటు చేయాలన్నారు. తల్లికి వందనం పథకం అమల్లో భాగంగా ఆధార్ నమోదులో పొరపాట్లు, రేషన్‌కార్డులు, భూమికి సంబంధించిన సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయని, వాటిని బుధవారం సాయంత్రంలోపు పరిష్కరించాలన్నారు. పీ4 పాలసీలో భాగంగా జిల్లాకు నిర్దేశించిన 50,701 బంగారు కుటుంబాలను 10 రోజుల్లో దత్తత తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 8 నుంచి 17లోపు బీఎల్‌ఓలకు శిక్షణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జేసీ డాక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, ఆర్డీఓలు సందీప్‌కుమార్, భరత్‌నాయక్, జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్‌పాల్ పాల్గొన్నారు.

అభిమానం కదిలిరాగా.. మనసారా స్మరించుకోగా..

కనుల పండువగా వైఎస్సార్ జయంతి

- జిల్లా వ్యాప్తంగా ఉప్పొంగిన అభిమానం
- కర్నూలులో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం
- వైఎస్సార్ విగ్రహాలకు పాలాభిషేకం
- కేక్ కటింగ్‌లతో సంబరాలు
- ప్రభుత్వాసుపత్రులలో పాలు, బ్రెడ్డు పంపిణీ

మనసున్న మారాజును ప్రతి గుండె స్మరించుకుంది. 108 సాక్షిగా నిలిచిన ప్రతి ప్రాణం చేతులెత్తి మొక్కింది. పారుతున్న నీటిబొట్టూ.. పచ్చని కోక కట్టిన పైర్లు.. కార్పొరేట్ వైద్యం అందుకున్న రోగులు.. 'గూడు'కట్టుకున్న అభిమానం.. రైతులుగా మారిన వ్యవసాయ కూలీలు.. వాళ్లూవీళ్లూ కాదు, ఊరూవాడా సంబరం అంబరాన్నంటింది. జిల్లాలో పండుగ వాతావరణం నెలకొంది. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సేవా కార్యక్రమాలతో నివాళులర్పించగా.. ఎక్కడికక్కడ మహానేత విగ్రహాలకు పూలమాలలు వేసి అభిమానం చాటుకున్నారు. ర్యాలీలు నిర్వహించి.. రక్తదానం చేసి.. ఆసుపత్రుల్లో పాలు, బ్రెడ్డు పంపిణీ చేసి సేవలతో నీరాజనాలర్పించారు. – కర్నూలు(టౌన్)



కర్నూలు నగరం వైఎస్సార్ సర్కిల్‌లో రాజన్న విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య, కేడీసీసీబీ మాజీ చైర్ పర్సన్ విజయమనోహరి, కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ సతీష్

☛ మంత్రాలయం నియోజకవర్గం పెద్దకడబూరు మండలంలోని బాపులదొడ్డి గ్రామంలో ఎమ్మెల్యే బాలనాగి రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్ రెడ్డి వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి కేక్ కట్ చేశారు.

☛ ఆదోని పట్టణంలో మహానేత డాక్టర్ వైఎస్సార్ 76 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మహిళా విభాగం అధ్యక్షురాలు శశికళ, పార్టీ నేతలు పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి ప్రదర్శనగా మహానేత విగ్రహం వద్దకు చేరుకున్నారు. వైఎస్సార్ విగ్రహానికి జలాభిషేకం, పాలా భిషేకం చేసి గజమాలతో అభిమానం చాటుకున్నారు.

☛ కర్నూలు పట్టణంలోని కల్లూరు శరీన్ నగర్‌లో దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ జయంతి వేడుకలను పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఘనంగా నిర్వహించారు. విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించి కేక్ కట్ చేశారు. పార్టీ నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



పత్తికొండలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తదితరులు

☛ కర్నూలు నగరంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పూలమాలలు వేసి కేక్ కట్ చేసిన నేతలు ఘనంగా నివాళులర్పించారు. కర్నూలు మేయర్ బీవై.రామయ్య పార్టీ నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు. అలాగే ఎస్‌టీబీసీ కళాశాల కమిటీ హాలులో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటైంది. 151మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు.

☛ ఎమ్మిగనూరు పట్టణంలో వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు కేక్ కట్ చేసిన మాజీ పార్లమెంటు సభ్యులు, నియోజకవర్గ ఇన్‌చార్జి బుట్టా రేణుక వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా ఉపాధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

☛ పత్తికొండ పట్టణంలో వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక పోస్టాఫీసు వద్దనున్న వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు.



శరీన్‌నగర్‌లో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



ఎమ్మిగనూరులో విద్యార్థినులకు దుప్పట్లు అందజేస్తున్న మాజీ ఎంపీ బుట్టా రేణుక



బాపులదొడ్డిలో వైఎస్సార్ విగ్రహావిష్కరణలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి



ఆదోని పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ మధుసూదన్, పార్టీ నేతలు

కూటమి ప్రభుత్వంపై ఇక దండయాత్ర



బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్‌ను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఎమ్మెల్సీ మధుసూదన్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు శశికళ తదితరులు

- చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం
- తాటాకు చప్పుళ్లకు జగన్ సైన్యం భయపడదు
- కార్యకర్తలకు అండగా ఉంటాం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



సమావేశానికి హాజరైన పార్టీ నేతలు, కార్యకర్తలు

మోసానికి బ్రాండ్ చంద్రబాబు

ప్రజలకు సేవ చేయడం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బ్రాండ్ అయితే.. మోసానికి సీఎం చంద్రబాబు బ్రాండ్‌గా నిలిచారు. బాబు ష్యూరిటీ ..మోసం గ్యారంటీ అనే నినాదాన్ని నియోజకవర్గ స్థాయి నుంచి మండల, గ్రామ స్థాయి వరకు తీసుకెళ్తాం. గత వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థను నీరుగార్చుతున్నారు. పత్తికొండ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తే పోలీస్ స్టేషన్‌లను కూడా ముట్టడిస్తాం. జగనన్న పరిపాలన మళ్లీ కావాలని ప్రజలు కోరుకుంటున్నారు.

– మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

అబద్ధాలతో పాలన

సీఎం చంద్రబాబు నాయుడు 30 ఏళ్లుగా అబద్ధాలు, మోసాలు, మోస్నుపోటుతోనే పాలన సాగిస్తున్నారు. మోసం హామీలతో గద్దెనెక్కిన తరువాత ప్రజలను వెన్నుపోటు పొడిచి చెత్త పరిపాలన చేస్తూ సుపరిపాలన అంటూ సంబరాలు చేసుకోవడం కూటమి ప్రభుత్వానికే చెల్లింది. 2029 ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పని చేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందాం. – ఎమ్మెల్సీ మధుసూదన్

పత్తికొండ: 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించింది. పాలకులు సంక్షేమం, అభివృద్ధిని మరిచిపోయారు. సుపరిపాలన సంబరాలు అంటూనే ప్రజల్లోకి వెళ్లేందుకు ఎమ్మెల్యేలు జంకుతున్నారు. ఆ ప్రభుత్వంపై దండయాత్ర చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. ఇక నుంచి ఊరూరా నిలదీస్తారు' అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. మంగళవారం పత్తికొండ పట్టణంలోని గోపాల్ ప్లాజాలో నియోజకవర్గ స్థాయి పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేస్తే సహించేది లేదన్నారు. చంద్రబాబు మోసాలను ఇంటింటికీ తీసుకెళ్లి ఎండగడతామన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో అక్రమ కేసులు బనాయిస్తే బెదిరిలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైన్యం తాటాకు చప్పుళ్లకు భయపడదన్నారు. మతిమరుపుతో సీఎం చంద్రబాబు హామీలన్నీ పూర్తి చేశామని చెబుతున్నారని, ఆయన తనయుడు లోకేష్ మంచి ఆసుపత్రిలో చికిత్స చేయించాలని హితవు పలికారు. ప్రభుత్వ పెద్దల అండతో పోలీసులు కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదన్నారు. తప్పుడు కేసులు పెడితే న్యాయస్థానంలో తేల్చుకుంటామన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై వేధింపులు, దౌర్జన్యాలకు పాల్పడితే తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లెక్క తేలుస్తామని హెచ్చరించారు. అనంతరం 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ' క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ, కేడీసీసీ బ్యాంకు మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు రామచంద్రారెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శశికళ, పొట్లపోటి ప్రవీణ, మేజర్ పంచాయతీ సర్పంచ్ కొమ్ము దీపిక, మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ శ్రీరంగడు, ఎంపీపీ నారాయణ్‌దాస్, సీనియర్ నాయకులు సోమశేఖర్, జెడ్పీటీసీలు సుహాషిణి, సుంకన్న, ఉరుకుందమ్మ, పులికొండనాయక్, నాయకులు అట్లా గోపాల్‌రెడ్డి, నాగభూషణంరెడ్డి, తుగ్గలి శ్రీనివాసరెడ్డి, శభాషపురం హనుమంతు, గాంధీరెడ్డి, భరత్‌చంద్రారెడ్డి, పక్కీరప్ప, రాజన్న యాదవ్, వెంకటేశ్వరరెడ్డి, ఎర్రగుడి రామచంద్రారెడ్డి, రవిరెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మిగనూరు పట్టణంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జ్ బుట్టా రేణుక ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్, సీనియర్ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. – ఎమ్మిగనూరు టౌన్

మధ్యవర్తిత్వంతో త్వరితగతిన కేసుల పరిష్కారం



జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాపును ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ది, ఇతర న్యాయవాదులు

కర్నూలు(సెంట్రల్): సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అన్ని కోర్టుల్లో మధ్యవర్తిత్వంతో కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు వెసులుబాటు లభిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి/జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షులు జి.కబర్ది అన్నారు. మంగళవారం జిల్లా న్యాయ సేవా సదన్‌లో మధ్యవర్తిత్వంపై శిక్షణ పొందిన న్యాయవాదులు, ఎన్‌జీఓలకు ఒక్కరోజు వర్క్‌షాపు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ది కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా కేసులు విచారణ వరకు వెళ్లకుండా త్వరగా పరిష్కారం అవుతాయన్నారు. రానున్న 90 రోజులపాటు మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పించేందుకు అన్ని కోర్టుల్లో ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం న్యూఢిల్లీ, మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన అనుజ సక్సేనా, నీనా కరే న్యాయవాదులకు, ఎన్‌జీఓలకు శిక్షణ ఇచ్చారు. న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ వివాదాల పరిష్కారానికి ప్రత్యామ్నాయ మార్గంగా సివిల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 89 కింద పరిగణించేదే మధ్యవర్తిత్వం అన్నారు. దీనివల్ల కోర్టుల్లో కేసులు విచారణకు వెళ్లకుండా పరిష్కరించుకోవచ్చన్నారు. మధ్యవర్తిత్వంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ హరినాథ్ చౌదరి పాల్గొన్నారు.

వాణిజ్యపన్నుల శాఖ జేసీగా నీరజ

కర్నూలు(హాస్పిటల్): వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్‌గా జె.నీరజ నియమితులయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆమె రాజమండ్రి నుంచి కర్నూలుకు బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆమె కర్నూలులో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ జాయింట్ కమిషనర్‌గా పనిచేస్తున్న సుధాకర్‌రావు రాజమండ్రికి బదిలీ అయ్యారు. ఈయనతో పాటు డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న పి.సురేష్‌బాబు సైతం విజయవాడ సీసీటీ కార్యాలయానికి బదిలీపై వెళ్లగా అనంతపురంలో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న మురళీమనోహర్ కర్నూలుకు బదిలీ అయ్యారు.

'పోతిరెడ్డిపాడు' నుంచి నీటి విడుదల పెంపు

జూపాడుబంగ్లా: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి నీటి విడుదలను 10 వేల నుంచి 20 వేల క్యూసెక్కులకు పెంచినట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సాయంత్రం ఆరుగంటల ప్రాంతంలో ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయంలోకి 1,86,079 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా డ్యాంలో 882 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ 2,4,5,6 గేట్ల ద్వారా 20వేల క్యూసెక్కుల నీటిని ఎస్సార్‌ఎంసీ కాల్వలోకి విడుదల చేస్తున్నామన్నారు.

క్లుప్తంగా

కేఎంసీ, ఆసుపత్రిలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల, కర్నూలు మెడికల్ కాలేజీలోని వివిధ ఖాళీల పోస్టుల భర్తీకి ఒప్పందం/అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన నియామకం చేసేందుకు కంబైన్డ్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. దరఖాస్తు ఫారం, ఇతర వివరాలు కర్నూలు, నంద్యాల జిల్లాల వెబ్‌సైట్ https://kurnool.ap.gov.in, https://nandyal.ap.gov.in లో ఉంచినట్లు తెలిపారు. ఆసక్తిగల వారు పై వెబ్‌సైట్‌ల నుంచి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని, నింపిన దరఖాస్తులను కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ కార్యాలయంలో ఈ నెల 16వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు సమర్పించాలని సూచించారు.

విద్యార్థిపై వీధి కుక్కల దాడి



గాయపడిన బాలుడితో తల్లి

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో స్కూలుకు వెళ్తున్న విద్యార్థి నీతీష్ కుమార్‌పై వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. స్థానికులు స్పందించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో గాయపడిన విద్యార్థిని గ్రామంలోని వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అందించారు. గ్రామంలో వీధి కుక్కల బెడద ఎక్కువైందని, వాటిని గ్రామం నుంచి దూరంగా తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఈగల్ టీమ్ ఐజీ నేడు కర్నూలు రాక

కర్నూలు: ఈగల్ టీమ్ ఐజీ ఆకె రవికృష్ణ కర్నూలు పర్యటనకు వస్తున్నారు. 'డ్రగ్స్ వద్దు బ్రో' పేరుతో పోలీసు శాఖ ఆధ్వర్యంలో కర్నూలు శివారులోని పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఉదయం 10.45 గంటలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఆకె రవికృష్ణతో పాటు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారు.

కులం పేరుతో దూషించి కత్తితో దాడి

ప్యాపిలి: మండల పరిధిలోని వెంగళాంపల్లిలో సోమవారం పీర్ల జలధికి వెళ్లే సందర్భంలో ఘర్షణ చోటు చేసుకుంది. గుండం వద్ద బండి రాజేశ్ అనే వ్యక్తి నిల్చుని ఉండగా అదే గ్రామానికి చెందిన సాయిచరణ్ చిందులు తొక్కుతూ రాజేశ్ కాలిపై తొక్కాడు. అక్కడున్న మనోజ్ అతన్ని వారించగా కులం పేరుతో దూషించాడు. కొద్దిసేపటి తర్వాత సాయిచరణ్, ధనుంజయ, రామాంజనేయులు, రమేశ్ తదితరులు రాజేశ్‌పై కత్తితో దాడి చేశారు. వారిని ఆపే ప్రయత్నం చేసిన మహేశ్‌ను కూడా కత్తితో పొడిచారు. కులం పేరుతో తమను దూషించడంతో పాటు కత్తులతో దాడికి పాల్పడినట్లు బాధితుల సోదరుడు మహేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

కోవెలకుంట్ల: మండలంలోని సౌదరదిన్నెకు చెందిన ఓ వ్యక్తి మంగళవారం బలవన్మరణానికి పాల్పడినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన సూర్యచంద్రుడు (36) గత కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతూ కోవెలకుంట్ల, కర్నూలు ఆసుపత్రుల్లో చికిత్స పొందినా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక గుళికలు మింగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చిన తర్వాత గమనించి ఆయన్ను చికిత్స నిమిత్తం కోవెలకుంట్ల ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మృతునికి భార్య భారతి, కుమార్తె చంద్రావతి, కుమారుడు గురుచరణ్ ఉన్నారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.



మోడుకు 'కొంగ'త్త అందాలు!

సుంకేసుల జలాశయం కనువిందు చేస్తోంది. తుంగభద్ర జలాలు భారీగా వచ్చి చేరుతుండటంతో నిండుకుండను తలపిస్తోంది. నీరు దిగువకు విడుదల చేస్తుండటంతో నదీ తీర ప్రాంతంలో పర్యాటకుల కోలాహలం కనిపిస్తోంది. ఇక నీటి కొంగలు గాల్లో కలియతిరుగుతూ, చేప జాడ కనిపిస్తే చాలు రెక్కలు కట్టుకుని వాలిపోతున్న దృశ్యాలను చూసేందుకు రెండు కళ్లు చాలవు. జలాశయం సమీపంలో ఓ ఎండిన మోడుపై వాలిన నీటి కొంగలు 'కొంగ'త్త అందాలను ఆవిష్కరిస్తున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

బీఎల్‌ఓల శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న జేసీ నవ్య

కల్లూరు: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పాణ్యం నియోజకవర్గ ఈఆర్‌ఓ (ఎన్నికల రిటర్నింగ్ అధికారి) జాయింట్ కలెక్టర్ నవ్య మంగళవారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్‌ఓల) శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ బీఎల్‌ఓల విధుల గురించి వివరించారు. వారికి అసెస్‌మెంట్ పరీక్ష నిర్వహించి సర్టిఫికెట్ మంజూరు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ విష్ణుప్రసాద్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ అనురాధ, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఈరన్న ఉత్సవాలను విజయవంతం చేద్దాం



ఉత్సవాల పోస్టర్లను విడుదల చేస్తున్న సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్

కౌతాళం: అందరి సహకారంతో ఉరుకుంద ఈరన్న స్వామి శ్రావణ మాస ఉత్సవాలను విజయవంతం చేద్దామని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పిలుపునిచ్చారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు అధ్యక్షతన మంగళవారం నూతనంగా నిర్మించిన డార్మెంటరీలో శ్రావణమాస ఉత్సవాల నిర్వహణపై అధికారులతో సమావేశం జరిగింది. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ.. ఈరన్న స్వామి శ్రావణమాస ఉత్సవాలు ఈ నెల 25 నుంచి ప్రారంభమై ఆగస్టు 23వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ఉత్సవ ఏర్పాట్లపై చర్చిస్తూ.. ఉరుకుందకు నలువైపులా ఉన్న రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేష్‌ను ఆదేశించారు. పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలని, భక్తుల సౌకర్యార్థం ఆదోని, ఎమ్మిగనూరు, కర్ణాటకలోని శిరుగుప్ప, రాయచూరు, బళ్లారి డిపోల వారు ప్రత్యేక బస్సులు నడిపేలా కృషి చేయాలన్నారు. ఆలయం వద్ద విద్యుత్ కోతలు లేకుండా చూడాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. తాగునీరు పుష్కలంగా ఉండాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సాంబయ్యకు సూచించారు. పార్కింగ్, బారికేడ్ల ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని, భక్తులకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆయా శాఖల అధికారులకు ఆదేశించారు.

ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు మాట్లాడుతూ.. నాలుగు వైపులా పార్కింగ్ స్థలాలతో పాటు లైటింగ్ ఏర్పాటు చేయాలని, బస్సులు తిరిగేందుకు స్థలాలను చదును చేయాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు నాలుగు వైపులా చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 48 సీసీ కెమెరాలతో పాటు 54 కెమెరాలతో నిఘా ఏరాటు చేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం రాత్రి వేళలోనూ అన్నదానం, నిత్య పూజలను వీక్షించేందుకు ఆలయం ఆవరణలో ఆరు చోట్ల భారీ స్క్రీన్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 8న శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మి వ్రతం ఉంటుందని, ఆ రోజు మహిళలకు ఉచిత దర్శనంతో పాటు గాజులు, రవిక ఇస్తామని చెప్పారు. భక్తులు తలనీలాల సమర్పించేందుకు మూడుచోట్ల కల్యాణ కట్టల ఏర్పాటు, అలాగే మూడుచోట్ల ప్రసాదం అమ్మకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. తహసీల్దారు రజినీకాంత్‌రెడ్డి, సీఐ అశోక్‌కుమార్, ఏఈలు నర్సన్న, నాగమల్లయ్య, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, ఆలయ ప్రధాన అర్చకుడు ఈరప్పస్వామి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సారాను అరికట్టండి

ఉరుకుందలో సారాను అరికట్టాలని ట్రస్టు బోర్డు మాజీ డైరెక్టర్ కోట్రేష్‌గౌడ్ సభ దృష్టికి తెచ్చారు. ఇటీవల మద్యం డోర్ డెలివరీ చేస్తున్నారని, దీన్ని అరికడితేనే ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించగలమన్నారు. ఉరుకుందలోనే ఇలాంటి పరిస్థితి ఉంటే ఎలా అని ప్రశ్నించారు.



పత్తికొండ-ఆదోని మార్గంలో రోడ్డు మధ్యలో ఏర్పడిన పెద్ద గుంత

నిర్లక్ష్యానికి పరాకాష్ట!

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్టగా ఈ చిత్రం నిలుస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సహా ఆ పార్టీల నాయకులంతా చెప్పేవి కళ్లబొల్లి మాటలే గానీ.. చేతలు ఉండవని స్పష్టం చేస్తోంది. అనాడేమో తాము అధికారంలోకి వస్తే రోడ్లన్నీ బాగుచేస్తామని టీడీపీ, జనసేన నాయకులు ఊదరగొట్టారు. పాలన చేపట్టి ఏడాది దాటినా రోడ్లు బాగు చేయడం కాదు కదా.. కనీసం రోడ్లపై గుంతలను కూడా పూడ్చలేకపోయారు. ఏదైనా పెద్ద ప్రమాదం జరిగి కుటుంబాలు రోడ్డున పడితేగాని నిర్లక్ష్యంతో మొద్దునిద్దరోతున్న ప్రభుత్వానికి రోడ్లపై ఏర్పడిన గుంతలు కనపడవేమో!

పత్తికొండ – ఆదోని మార్గంలో హంద్రీనీవా కాలువ సమీపంలో రోడ్డు మధ్యలో కుంగిపోయి గొయ్యి ఏర్పడి ప్రమాదకరంగా మారింది. దీంతో ఎప్పుడు ఎవరికి ఎలాంటి ముప్పు వాటిల్లుతుందో తెలియదు. ఈ మార్గంలో నిత్యం బస్సులు, కార్లు, జీపులతో పాటుగా ద్విచక్ర వాహనాలు వందలాదిగా వెళ్తుంటాయి. దీనికి సమీపంలోనే మద్యం దుకాణం కూడా ఉంది. ఇక్కడే ఉన్న ఓ కల్వర్టు ప్రమాదకరంగా ఉండటంతో చుట్టూ ఫెన్సింగ్ వేశారు. రాత్రి సమయాల్లో వాహనాలు రయ్యిమని దూసుకొస్తూ రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతలను చివరి క్షణంలో గుర్తించి వేగం తగ్గించుకుని రెప్పపాటులో ప్రమాదాల నుంచి తప్పించుకుంటున్నారు. ముందుకు వెళ్లేశాక 'హమ్మయ్యా.. దాటేశాం'. నడిరోడ్డుపై ఇంత పెద్ద గుంత ఉన్నా ఈ ప్రభుత్వానికి కనపడదా అని వాహనదారులు, ప్రయాణికులు కూటమి నిర్లక్ష్యంపై పెదవి విరుస్తున్నారు.

– పత్తికొండ రూరల్

ఆపరేషన్ 'క్యాంపస్ సేఫ్ జోన్'

- విద్యాసంస్థల వద్ద పొగాకు ఉత్పత్తుల అమ్మకాలపై నిషేధం
- జిల్లా అంతటా స్పెషల్ డ్రైవ్



దుకాణంలో తనిఖీ చేస్తున్న పోలీసులు

కర్నూలు: జిల్లా పోలీసు శాఖ మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విద్యాసంస్థల వద్ద వంద గజాల పరిధిలో పొగాకు ఉత్పత్తుల అమ్మకంపై నిషేధం విధిస్తూ సురక్షితమైన వాతావరణాన్ని కల్పించే లక్ష్యంతో ఆపరేషన్ 'క్యాంపస్ సేఫ్ జోన్' కార్యక్రమాన్ని చేపట్టారు. మంగళవారం జిల్లావ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థల వద్ద వంద గజాల దూరంలో పొగాకు సంబంధిత పదార్థాల అమ్మకంపై నిషేధం విధిస్తూ ఆపరేషన్ 'క్యాంపస్ సేఫ్ జోన్' పేరుతో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పాన్ షాపులు, కిరాణం దుకాణాలు, టీ షాపుల వద్ద సిగరెట్లు, ఖైనీ, గుట్కా వంటి అమ్మకాలను నిలిపివేయాలని వ్యాపారులను ఆదేశించారు. పోలీసుల సూచనలను పాటించని వ్యాపారులపై సీఓపీటీఏ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేయడమే గాక కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. మత్తు పదార్థాలు, పొగాకు ఉత్పత్తులు, గుట్కా నిల్వలు అక్రమంగా కలిగి ఉన్నా, విక్రయాలు జరిపినా సీఓపీటీఏ చట్టం ప్రకారం షాపులను సీజ్ చేసి, యజమానులపై కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తనిఖీ సందర్భంగా పోలీసు అధికారులు హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం



మృతి చెందిన రాజశేఖర్, ఫరూక్

నందికొట్కూరు: మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు – దామగట్ల గ్రామాల మధ్య కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఘటనకు సంబంధించి హెడ్‌కానిస్టేబుల్ రమణ తెలిపిన వివరాలు.. దామగట్ల గ్రామానికి చెందిన ఏడుగురు స్నేహితులు సోమవారం సాయంత్రం సరదాగా గడిపేందుకు ఏపీ 21 సీజే 6804 నంబరు గల కారులో బ్రాహ్మణకొట్కూరుకు వచ్చారు. అక్కడినుంచి రాత్రి దామగట్ల గ్రామానికి వెళుతుండగా మార్గం మధ్యలో కారు అదుపుతప్పి కారు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో ఫరూక్ (34), రాజశేఖర్ (33) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. కిషోర్‌కు గాయాలు కాగా మిగతావారు అక్కడి నుంచి వెళ్లిపోవడంతో వారి గురించి తెలియలేదు. ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాలను ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. కిషోర్ ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. ప్రమాదంపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నట్లు చెప్పారు. మృతుడు ఫరూక్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. రాజశేఖర్‌కు వివాహం కాలేదు.

పీఏసీఎస్‌లకు పాలక వర్గాల ఏర్పాటు

- ఉమ్మడి జిల్లాలో 34 సొసైటీలకు నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీల ఏర్పాటు
- జీఓ నంబరు 543 జారీ చేసిన కూటమి ప్రభుత్వం

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో 34 వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు నాన్ అఫీషియల్ త్రీ మెన్ కమిటీలను ఏర్పాటు చేస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు జిల్లాలో 22, నంద్యాల జిల్లాలో 12 పీఏసీఎస్‌లకు త్రీ మెన్ కమిటీలను ఏర్పాటు చేస్తూ సహకార శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్ మంగళవారం జీఓ ఆర్‌టీ నంబర్ 543 జారీ చేశారు. ముగ్గురిలో ఒకరు చైర్మన్‌గా, ఇద్దరు సభ్యులుగా ఉంటారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి కర్నూలు మండలంలోని ఉల్చాల సొసైటీ చైర్మన్‌గా నియమితులయ్యారు. కర్నూలు జిల్లాలో ఉల్చాల (డి.విష్ణువర్ధన్‌రెడ్డి), మామిదాలపాడు (సూర్యప్రకాశ్‌రెడ్డి), పసుపల (వెంకటరాముడు), గార్గేయపురం (పక్కృద్దీన్), సీ.బెళగల్ (చిన్నతిమ్మప్ప), గూడూరు (దానమయ్య), కోయిలకొండ (నాగరాజు), వెల్దుర్తి (కోదండపాణి), చిన్న తుంబళం (కే.నరసప్ప), ఆర్లబండ (అయ్యన్న), కల్లుదేవకుంట (రంగమ్మ), మంచాల (రామకృష్ణారెడ్డి), నందవరం (గోపాల్ రాజు), బదినెహాల్ (మారెప్ప), కౌతాళం (వెంకటపతిరాజు), పత్తికొండ(తలారి రంగప్ప), బూరుజుల (ఎర్రిస్వామి), మద్దికెర (ఆకుల ఆనంద్), మారెళ్ల అశోక (వై.ప్రభాకర్‌రెడ్డి), ఉప్పర్లపల్లి (ఏ.వేణుగోపాల్), హెచ్.కైరవాణి(ఎం.ఆనందం), ఉల్లిందకొండ (ఇవి.రమణ), నంద్యాల జిల్లాలో డోన్ (యల్లగౌడు), బేతంచెర్ల (రాధకృష్ణ), పగిడ్యాల (దామోదర్‌రెడ్డి), పీర్‌సాబ్‌పేట (వెంకటేశ్వరెడ్డి), నందికోట్కూరు (మూర్తుజావలి), మద్దూరు (కే.జనార్దన్‌రెడ్డి), నాగంపల్లి (బి.నాగేశ్వరరావు), వెలుగోడు (ఎం.శివశంకర్‌రెడ్డి), టంగుటూరు (లక్ష్మీకాంతరెడ్డి), సంజామల (పి.కిరణ్‌కుమార్), కోవెలకుంట్ల (గువ్వల సుబ్బారెడ్డి), లింగాల (ఏవీ సుబ్బారెడ్డి) పీఏసీఎస్‌లకు పాలక వర్గాలు ఏర్పాటయ్యాయి.

తపాలా శాఖలో అత్యాధునిక సాంకేతికత



మాట్లాడుతున్న కర్నూలు పోస్ట్ మాస్టర్ జనరల్ డాక్టర్ వెన్నం ఉపేందర్

కర్నూలు (న్యూటౌన్): భారత ప్రభుత్వం, తపాలా శాఖ చేపట్టిన ఆధునికీకరణలో భాగంగా ఏపీటీ (అడ్వాన్స్ డ్ పోస్టల్ టెక్నాలజీ) 2.0 సేవలు రాష్ట్ర వ్యాప్తంగా మూడు ప్రధాన కార్యాలయాల్లో ప్రారంభమయ్యాయని కర్నూలు పోస్ట్ మాస్టర్ జనరల్ డాక్టర్ వెన్నం ఉపేందర్ అన్నారు. మంగళవారం కర్నూలు నగరంలోని హెడ్ పోస్టాఫీసులో ఏపీటీ 2.0 రోల్ అవుట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. డిజిటల్ ఎక్సలెన్స్ దిశగా తపాలాశాఖ చేపడుతున్న చర్యల్లో ఏపీటీ 2.0 ఒక మైలురాయి అన్నారు. ఏపీటీ అప్లికేషన్‌ను వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వేగవంతమైన, మెరుగైన సేవలు అందించడానికి రూపొందించామన్నారు. ఈ నూతన టెక్నాలజీతో పోస్టాఫీసుల పనితీరు మరింత సమర్థవంతంగా మారనుందన్నారు. కర్నూలు సూపరింటెండెంట్ జి.జనార్దన్‌రెడ్డి, కర్నూలు రీజనల్ పోస్టల్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగనాయక్, కర్నూలు హెడ్ పోస్ట్‌మాస్టర్ సి.రాజేశ్వరి, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు జనన ధ్రువీకరణ పత్రాలు



మాట్లాడుతున్న బి.లీలా వెంకటశేషాద్రి

కర్నూలు(సెంట్రల్): ఉమ్మడి జిల్లాలో సాథి కమిటీ గుర్తించిన అనాథ పిల్లలకు జనన ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేందుకు సంబంధిత శాఖలు చర్యల తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలావెంకట శేషాద్రి ఆదేశించారు. మంగళవారం న్యాయసేవా సదన్‌లో ఆయన సాథి కమిటీ శాఖల ఉన్నతధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దిక్కులేని, అనాథ పిల్లలను గుర్తించే కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించాలని సూచించారు. స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి వారికి ఆధార్ కార్డులు ఇప్పించాలన్నారు. అయితే ఆధార్ కార్డులను పొందడానికి జనన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో మొదట వాటిని ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తరువాత ప్రత్యేక క్యాంపులు నిర్వహించి ఆధార్ ఎన్‌రోల్ చేయించి వారందరికీ సంక్షేమ పథకాలు వర్తించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో కర్నూలు కలెక్టరేట్ నుంచి ఇంద్రాణి, డీఎంహెచ్‌ఓ శాంతికళ, నంద్యాల అదనపు డీఎంహెచ్‌ఓ శారదబాయి, కర్నూలు ఐసీడీఎస్ సీడీపీఓ శారద, నంద్యాల సీడీపీఓ స్వప్న, కర్నూలు అర్బన్ తహసీల్దార్ రవికుమార్ పాల్గొన్నారు.

ఉపాధి కరువై.. బతుకు దుర్భరమై



నిట్రవట్టి నుంచి పిల్లాపాపలతో వలస వెళ్లేందుకు సిద్ధమైన కూలీలు

హాలహర్వి: స్థానికంగా ఉపాధి లేకపోవడంతో మండలంలోని నిట్రవట్టి, విరుపాపురం గ్రామాల నుంచి 80 కుటుంబాలు మంగళవారం రాత్రి తెలంగాణ రాష్ట్రానికి మినీ లారీలో వలస వెళ్లారు. కూలీలతో పాటు వారి పిల్లలు, బడికి వెళ్లే విద్యార్థులు కూడా తట్టాబుట్టా, సామగ్రి సర్దుకుని వెళ్లారు. స్థానికంగా ఉపాధి పనులు ఉంటే ఇక్కడే పని చేసుకుంటూ ఉండేవారమని, పనులు లేకపోవడంతో పస్తులుండలేక వలస వెళ్తున్నట్లు కూలీలు మద్దిలేటి, కౌలుట్ల, చంద్రమ్మ, నారాయణ, పార్వతమ్మ తదితరులు వాపోయారు.

తమ్ముళ్లు పంచుకున్నారు!



గురజాలలో యురియాను లారీ నుంచి ట్రాక్టర్‌లోకి లోడ్ చేసుకొని తరలిస్తున్న తెలుగు తమ్ముళ్లు

నందవరం: రైతులకు చేరాల్సిన ఎరువులను తెలుగు తమ్ముళ్లు పంచుకున్న ఘటన గురజాల గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఖరీఫ్‌లో వివిధ పంటలు సాగు చేసిన రైతులు తమ అవసరం మేరకు రైతు సేవా కేంద్రాల ద్వారా నమోదు చేసుకున్నారు. ఈ మేరకు గ్రామానికి 300 బస్తాల ఎరువుల లారీ చేరుకుంది. అయితే వీఏఏ స్టాక్ వచ్చిన విషయాన్ని ఏఓకు సమాచారం ఇవ్వక పోవడంతో పాటు లారీ రైతు సేవా కేంద్రానికి కూడా తరలించలేదు. ఊరి మధ్యలోనే ఉంచి టీడీపీ నేతలకు తలా పది సంచులు మేర ఎత్తించడంతో రైతులు అవాక్కయ్యారు. ఎరువుల కోసం ఎదురు చూస్తున్న తమ పరిస్థితి ఏంటని ఆందోళన చెందుతున్నారు. యూరియా కొరత లేదంటున్న ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయిలో జరుగుతున్న పంపిణీని పరిశీలించి సామాన్య రైతులకు ఎరువులు అందేలా చూడాల్సిన అవసరం ఉంది. ఈ విషయంపై మండల వ్యవసాయ అధికారిణి సరితను వివరణ కోరగా వీఏఏపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. ఇండెంట్ మేరకు ఎరువులు సరఫరా చేస్తున్నామని, బుధవారం మరో 300 సంచుల యూరియా గ్రామానికి చేరుకుంటుందన్నారు.

లక్ష్యాల సాధనపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న జేడీ శ్రీనివాస్

కర్నూలు(అగ్రికల్చర్): పశుసంవర్ధక శాఖ లక్ష్యాలపై వెటర్నరీ అసిస్టెంటు సర్జన్లు, అసిస్టెంటు డైరెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా జాయింట్ డైరెక్టర్ జి.శ్రీనివాస్ సూచించారు. వ్యాక్సినేషన్, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాపడం వంటి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మంగళవారం కర్నూలులోని బహుళార్థ పశువైద్యశాల ప్రాంగణంలో జిల్లాలోని పశువైద్యులు, ఏడీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రాధాన్యత అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెంపుడు కుక్కలన్నింటికీ యాంటీ రేబిస్ వాక్సిన్ చేయించాలని సూచించారు. అన్ని పశు వైద్యశాలల్లో రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉందన్నారు. శాస్త్రీయ పద్ధతుల్లో గొర్రెల పెంపకాన్ని ప్రోత్సహించాలని, దీనిపై పశుపోషకులకు అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధులపై పశువైద్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాల ఉత్పత్తిని పెంచడంపై దృష్టి సారించాలన్నారు. పశుగ్రాసాల సాగును ప్రోత్సహించాలని, సబ్సిడీపై పశుగ్రాసం విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కర్నూలు, ఆదోని డీడీలు దుర్గాప్రసన్నబాబు, రమణ, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డీడీ రాజశేఖర్, వీపీసీ డీడీ హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.